25 ముఖాలు.. 50 చేతులు



ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి జలాల వీధిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం అందరినీ ఆకట్టుకుంటోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన విగ్రహానికి 25 ముఖాలు, 50 చేతులు ఉన్నాయి. ఆభరణాలతో అమ్మవారిని అందంగా అలంకరించారు. విగ్రహం తయారీ అలంకరణకు రూ. లక్ష ఖర్చు అయ్యిందని నిర్వాహకులు చెప్పారు. ఈ విగ్రహాన్ని చూడటానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తున్నారు.



చిట్టితల్లులు.. నవదుర్గలు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నం వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో సరస్వతీ పూజలు చేయించి వారికి పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు నవదుర్గల వేషధారణలో అలరించారు. అంతకుముందు లక్ష్మీ పూజల్లో పాల్గొన్న స్త్రీలకు బహుమతులు అందజేశారు.

ఒత్తిడిని చిత్తుచేయండిలా...



నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం

ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం

మానసిక అనారోగ్యం అందరినీ ఇబ్బందులకు గురిచేస్తోంది. మానసిక ఎదుగుదల లేక ఇబ్బందులు పడుతున్న చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. దీనికి తోడు పనిలో ఒత్తిడితో పెద్దలు సైతం మానసిక అనారోగ్యానికి గురవుతున్నారు. వయసు పెరుగుతున్న నేపథ్యంలో మానసిక రుగ్మతలతో ఇబ్బందులు పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈనెల 10న ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కథనం.

అనకాపల్లిలోని ప్రభుత్వ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్‌కు ఒత్తిడి ఎక్కువగా ఉండడంతో ఉన్నట్టుండి అరవడం, కేకలు వేయడం చేస్తున్నాడు. ఇదివరకు ఆయన చాలా ప్రశాంతంగా ఉండేవారు. ఇప్పుడు ఈయన ప్రవర్తనలో మార్పు రావడంతో సైకాలజిస్టుకు చూపించుకోగా ఆయన కొన్ని సలహాలు ఇచ్చి మందులు వాడమని చెప్పారు.

» అనకాపల్లికి చెందిన ఎనిమిదేళ్ల కుర్రాడు మొండిగా తయారయ్యాడు. ఎవర్నికైనా ఎదురు చెప్పడం, దుర్భాషలాడడం, తగాదాలకు దిగడం చేస్తున్నాడు. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకురాగా తల్లిదండ్రులు గొడవలు పడడం చూసి పిల్లలు ఇలా తయారైనట్లు గుర్తించి కౌన్సెలింగ్ ఇస్తున్నారు.

» అనకాపల్లి ఆసుపత్రిలో ఇటీవల ఒక గైనకాలజిస్టు ఆశా కార్యకర్తలపై పెద్దగా కేకలు వేశారు. దీంతో ఆశా కార్యకర్తలంతా ఆందోళనకు దిగారు. తాను రెండు చోట్లకు ప్రసవాలు చేయడానికి పరుగులు తీయాల్సి వచ్చిందని, ఆ ఒత్తిడిలో అరిచి దురుసుగా ప్రవర్తించానని వైద్యురాలు ఆశా కార్యకర్తకు క్షమాపణ చెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.



చిన్నారులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

★ మునగపాకకు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు అక్షరాలను రివర్స్‌లో రాస్తున్నాడు. ఇలా చాలాకాలంగా చేస్తున్నాడని అనకాపల్లిలోని బాలల సత్వర చికిత్స కేంద్రానికి తీసుకొచ్చారు. ఇదొక మానసిక రుగ్మత అని కౌన్సెలింగ్ ఇచ్చి చికిత్స అందిస్తున్నారు.

★ అనకాపల్లిలోని ప్రైవేటు ఫైనాన్స్ కార్యాలయంలో పనిచేస్తున్న వ్యక్తికి లక్ష్యాలు పూర్తిచేయక వస్తున్న ఒత్తిడితో ఆత్మహత్యకు యత్నించాడు. స్నేహితులు వెంటనే ఆసుపత్రికి తరలించి ప్రాణాలను రక్షించి మరో ఉద్యోగంలో చేర్పించారు.



పనిచేసే ప్రదేశాల్లో ఒత్తిడి పెరుగుతోంది. ఒక సర్వే ప్రకారం ప్రతి పది మందిలో ఎనిమిది మంది ఒత్తిడికి గురవుతున్నట్లు తేలింది. వీరిలో నలుగురు వరకు మానసిక అనారోగ్యానికి గురవుతున్నారు.

చిన్నా పెద్దా లేకుండా చాలామంది మానసిక అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారు. పుట్టుకతో వచ్చిన లోపాలు, పెరుగుతున్న వాతావరణం మధ్య చిన్నారుల్లో మానసిక ఎదుగుదల లేక అనారోగ్యం పాలైనవారు కొందరు.. పని ఒత్తిడితో మానసిక అనారోగ్యానికి గురైన వారు మరి కొందరు.. యుక్త వయస్సు నుంచి పదవీ విరమణ పొందే వరకు సహచరులతో కలిసి ఉద్యోగం చేయాలి. ఇప్పుడు భార్య, భర్త ఉద్యోగం చేయడం పరిపాటిగా మారింది. శారీరక శ్రమ పెద్దగా లేకపోయినా మానసికంగా ఉండే ఒత్తిడితో అనారోగ్యానికి చాలామంది గురవుతున్నారని సైకాలజిస్టులు చెబుతున్నారు.

ఒత్తిడిని అధిగమించడానికి సహచరులతో మాట్లాడటం, కోపాన్ని తగ్గించుకోవడం, ప్రతి విషయాన్ని అతిగా ఆలోచించకుండా ప్రశాంతంగా ఉండటం మంచిది. ముఖ్యంగా ఆఫీసు విషయాలు ఇళ్లలో ప్రస్తావించకుండా, ఖాళీ సమయాల్లో కుటుంబ సభ్యులతో గడపాలని వైద్యులు చెబుతున్నారు.

టోల్ ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించొచ్చు: ప్రస్తుతం పనిచేసే ప్రదేశాల్లో ఒత్తిడితో మానసిక అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది పనిచేసే ప్రదేశంలో మానసిక ఆనందం అందించాలన్న నినాదంతో ప్రచారం చేస్తున్నాం. మానసిక సమస్యలు ఉంటే చిన్నారులకు వైద్యంతో పాటు పెద్దలకు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సను అందించేలా చర్యలు తీసుకుంటున్నాం. పీహెచ్‌సీలకు సైకాలజిస్టులను రప్పించి చికిత్స అందిస్తున్నాం. వైద్య సలహాల కోసం 14416 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయొచ్చు. 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారు. వారు వైద్యం కోసం సలహాలు సూచనలు ఇస్తారు.

– డాక్టర్ ప్రశాంతి, ఎన్‌సీడీ పీవో



సకాలంలో గుర్తించాలి: మానసిక ఎదుగుదల లేని చిన్నారులకు సకాలంలో గుర్తించి చికిత్సకు తీసుకురావాలి. అనకాపల్లి, నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రుల్లో బాలల సత్వర చికిత్స కేంద్రాలు ఉన్నాయి. మానసిక ఎదుగుదల లేని చిన్నారులు వారంలో పది మంది వరకు కేంద్రాలకు వస్తున్నారు. వీరికి చికిత్స అందిస్తున్నాం. కౌన్సెలింగ్ థెరపీ ద్వారా చిన్నారుల ప్రవర్తనలో మార్పు తీసుకురావచ్చు.

– డాక్టర్ క్రాంతి, చిన్నపిల్లల వైద్య నిపుణులు, డీఈఐసీ సెంటర్



దరఖాస్తుల ఆహ్వానం

కశింకోట, న్యూస్‌టుడే: తేగాడ కస్తూర్బా పాఠశాలలో వంటమనిషి పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో వీవీ.రవికుమార్, ఎంఈవో-2 కె.ఎస్.ఎస్.మూర్తి తెలిపారు. సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నెలకు రూ. 15 వేల వేతనంతో పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మహిళా అభ్యర్థులు ఈనెల 15లోగా దరఖాస్తులను స్థానిక ఎంఈవో కార్యాలయంలో అందించాలన్నారు.

గ్యాస్ లీక్ ఘటనలో మరొకరి మృతి

ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ఎలమంచిలి మండలం లైనుకొత్తూరు పరిధిలోని ఫ్యూజన్ ఇటుకల పరిశ్రమలో గ్యాస్ లీకైన ఘటనలో మరొకరు మృతి చెందారు. ఈ పరిశ్రమలో శనివారం చోటుచేసుకున్న ప్రమాదంలో అదేరోజు ఒకరు మృతి చెందగా, కేజీహెచ్‌లో మరో ఇద్దరు చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా సుహని గ్రామానికి మోలి లోక్‌నాథ్ (27) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై ఉపేంద్ర తెలిపారు.

ఆహారం తయారీలో ఇష్టారాజ్యం



ఎలమంచిలి బేకరీలో తనిఖీ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి విజయ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలిలో కాలం చెల్లిన దినుసులతో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారని సీనియర్ సివిల్ జడ్జి పి.విజయ చేపట్టిన తనిఖీల్లో బయటపడింది. 'ఆపరేషన్ స్వేచ్ఛ'ను పురస్కరించుకుని బాల కార్మికులు ఎవరైనా ఉన్నారా అన్నది గమనించడానికి బుధవారం జడ్జి ఎలమంచిలిలోని హోటళ్లు, బేకరీల్లో తనిఖీలు చేశారు. కాలం చెల్లిన మైదాపిండిని గుర్తించారు. ఇటువంటి పదార్థాలు వాడకూడదని నిర్వాహకులకు హెచ్చరించారు. హోటళ్లు, బేకరీలు పరిశుభ్రంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. పట్టణ ఎస్సై సావిత్రి, న్యాయవాదులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరల నియంత్రణకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: నిత్యావసర ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జేసీ జాహ్నవి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం పౌర సరఫరాలు, మార్కెటింగ్, తూనికలు కొలతల శాఖ అధికారులు, హోల్‌సేల్ వ్యాపారులు, షాపింగ్ మాల్స్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాలు మేరకు టమాటా, ఉల్లిపాయలు, వంటనూనెలు ప్రత్యేక కౌంటర్ల ద్వారా అమ్మకాలు చేపట్టాలన్నారు. సాధ్యమైనంత తక్కువ ధరలకు అందించాలని వ్యాపారులకు సూచించారు. కృత్రిమ కొరత సృష్టించకుండా అధికారుల కమిటీ తనిఖీలు నిర్వహించాలన్నారు. సరకులు నిల్వలు, అమ్మకాలపై రోజువారీ నివేదిక అందించాలన్నారు. డీఎస్‌వో మూర్తి, డీఎం జయంతి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక కౌంటర్లలో విక్రయాలు

గురువారం నుంచి అనకాపల్లి, నర్సీపట్నం, ఎలమంచిలి తదితర ప్రాంతాల్లో నిత్యావసర సరకుల అమ్మకాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామని జేసీ జాహ్నవి వెల్లడించారు. ఉల్లిపాయలు కేజీ రూ. 60, టమాటా రూ. 52, పామాయిల్ లీటరు రూ. 117, ఫ్రీడం రూ. 126, వేరుశనగ రూ. 155 చొప్పున అమ్మకాలు చేపడుతున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మోర్, రిలయన్స్, డిమార్ట్, విశాల్‌మార్ట్ తదితర అవుట్‌లెట్లలో కూడా ఇవే ధరలు ఉంటాయన్నారు. వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.



రోలుగుంట వద్ద దట్టంగా కమ్ముకున్న పొగమంచు

మంచు కురిసే.. పల్లె మురిసె..

వాతావరణంలో చోటుచేసుకున్న మార్పుల కారణంగా కొద్దిరోజులుగా విపరీతమైన ఉష్ణోగ్రతతోపాటు తెల్లవారుజామున దట్టమైన పొగమంచు గ్రామాలను కమ్మేస్తోంది.. ప్రధానంగా బీఎన్ రహదారి పొడవునా నర్సీపట్నం-చోడవరం మార్గంలో మంచు భారీగా కురియడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పగటిపూటే వాహనదారులు లైట్లు వెలిగిస్తూ వాహనాలపై ప్రయాణాలు సాగిస్తున్నారు. – న్యూస్‌టుడే, రోలుగుంట

గిరిజనుల విద్యా సదుపాయాలపై చిన్నచూపు

రోలుగుంట, న్యూస్‌టుడే: ఆదివాసీ, గిరిజనులకు అందించాల్సిన సదుపాయాలు, కల్పించాల్సిన రాయితీలపై పాలకుల చిన్నచూపు తగదని గిరిజన సంఘం నాయకులు ఈరెల్లి చిరంజీవి పేర్కొన్నారు. అర్లశివారు గదబపాలేనికి 2012-13లో మంజూరైన పాఠశాల భవన నిర్మాణపనులు నేటివరకూ పూర్తి కాలేదన్నారు. అసంపూర్తి పాఠశాల వద్ద విద్యార్థులతో కలిసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. విద్యకు ఎక్కడా ఆటంకం కలగకూడదని ఇక్కడి గిరిజనులు శ్రమదానంతో తాటాకులతో పాఠశాల వసతి నిర్మించుకున్నారని చిరంజీవి పేర్కొన్నారు. గతంలో ఈ ప్రాంతాలకు రహదారి సదుపాయం సక్రమంగా లేక మంజూరైన పాఠశాల భవన నిర్మాణ పనులు నిలిపివేశారని పేర్కొన్నారు. ఇప్పటికైనా పాలకులు తక్షణమే స్పందించి గదబపాలెంలో నిలిచిన పాఠశాల నిర్మాణపనులు తక్షణమే పునః ప్రారంభించాలని కోరారు.



పాఠశాల భవనం నిర్మించాలని వేడుకుంటున్న విద్యార్థులు

గోకులం షెడ్లలో అక్రమాలపై విచారణ

కోటవురట్ల, న్యూస్‌టుడే: పాడి రైతులు నిర్మించుకున్న మినీ గోకులం షెడ్ల బిల్లుల చెల్లింపులో జరిగిన అవకతవకలపై పశు సంవర్ధక సహాయ సంచాలకులు పెట్ల నరేష్ బుధవారం విచారణ చేపట్టారు. రాజుపేటలో షెడ్లను పరిశీలించి అనంతరం రైతులతో సమావేశమయ్యారు. ఎవరికి ఎంత బిల్లులు చెల్లింపులు జరిగాయనే దానిపై రైతులను ఆరా తీశారు. బిల్లులు సాయిబాబాజీ ఏజెన్సీ ఖాతాలో జమయ్యాయని, సుమారు రూ 25 లక్షల వరకు రావాల్సి ఉందని రైతులు చెప్పారు. మినీ గోకులం షెడ్ల బిల్లుల్లో అక్రమాలు జరిగాయని గ్రామానికి చెందిన విశాఖ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు ప్రసాద్ ఫిర్యాదు చేశారని ఏడీ తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.



రాజుపేటలో రైతులతో మాట్లాడుతున్న ఏడీ నరేష్

విజయదుర్గమ్మకు బంగారం, వెండి ఆభరణాలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: హరిపాలెం హరిగిరి క్షేత్రంలో విజయదుర్గమ్మకు కాంట్రాక్టర్ రామఅప్పారావు, అప్పలమణి దంపతులు రెండు తులాల బంగారు శతమానాలు, భీమిశెట్టి తాతారాజు అన్నపూర్ణ దంపతులు 16 తులాల వెండి కాసుల పేరును బుధవారం అందించారు. పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వీరికి పలకలు, పెన్సిళ్లు శివమణిక్యాలరావు దంపతులు సమకూర్చారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మారిశెట్టి సూర్యనారాయణ, సర్పంచి లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.



హరిపాలెంలోని విజయదుర్గమ్మ



చోడవరంలో సరస్వతీదేవి అవతారంలో కనకదుర్గమ్మ

సామూహిక అక్షరాభ్యాసాలు

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: చోడవరం కనక దుర్గమ్మ దేవాలయంలో అమ్మవారిని సరస్వతీదేవి అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. హోమం, ప్రత్యేక పూజలు, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. స్వయంభూ విఘ్నేశ్వర స్వామి దేవాలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు కొడమంచిలి చలపతి ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం చేశారు.

వెంకన్నకు గరుడ వాహన సేవ

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఉపమాక వెంకన్న ఆలయంలో బుధవారం స్వామివారి గరుడ వాహన సేవ వేడుకగా సాగింది. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి ఉత్సవ మూర్తులకు, సుదర్శన పెరుమాళ్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంతోత్సవాన్ని నిర్వహించారు.



ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న అర్చకులు

కళ్లని ప్రేమించండి



నేడు ప్రపంచ దృష్టి దినోత్సవం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

రాంబిల్లికి చెందిన మూడో తరగతి విద్యార్థి నోట్‌బుక్‌లో తరచూ తప్పులు రాస్తున్నాడు. సరిదిద్దుతున్న ఉపాధ్యాయిని ఆ విద్యార్థి బోర్డుపై రాసిన వాటిని నిర్లక్ష్యం రాస్తున్నాడని అనుకున్నారు. కొన్ని రోజుల తర్వాత బోర్డు పైన అక్షరాలు విద్యార్థికి సరిగా కనిపించడం లేదని గుర్తించారు. పరీక్ష చేయించి విద్యార్థికి కంటి అద్దాలు పెట్టించారు.

అనకాపల్లికి చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి ఎక్కువగా సెల్‌ఫోన్ చూస్తున్నాడు. కళ్లు మసకగా కనిపిస్తున్నాయని కంటి వైద్యుడి వద్దకు వెళ్లగా కంటిపై ఎక్కువగా ఒత్తిడి వల్ల దృష్టి లోపం వచ్చినట్లు గుర్తించి కంటి అద్దాలు అమర్చారు.

ఎంతో మంది చిన్నారులు దృష్టి లోపంతో ఇబ్బందులు పడుతున్నారు. ఒకప్పుడు వయసు మీరిన వారికే దృష్టి లోపం ఉండేది. ఇప్పుడు వయస్సుతో సంబంధం లేకుండా కంటి చూపు మందగించడం ఆందోళన కలిగిస్తోంది. ప్రపంచ దృష్టి దినోత్సవం పురస్కరించుకుని ఈ ఏడాది విద్యార్థులు మీ కళ్లను ప్రేమించండి అన్న నినాదంతో నేత్ర వైద్యులు, సిబ్బంది ప్రచారం చేస్తున్నారు.

పాఠశాలలు, కళాశాలలకు వెళ్తే ప్రతి 20 మందిలో ఒకరికి కంటి అద్దాలు ఉంటున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ సర్వే ప్రకారం ప్రతి లక్ష మందిలో 1000 మంది దృష్టి సమస్యతో బాధపడుతున్నట్లు గుర్తించారు. 2025 నాటికి దీని సంఖ్యను 300 వరకు తగ్గించాలన్న లక్ష్యంతో దృష్టి లోపం నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి అక్టోబరు వరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఒకటి నుంచి పదోతరగతి వరకు విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్నారు. సెప్టెంబరు నెలాఖరువరకు 23,198 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేయగా వీరిలో 1157 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురు విద్యార్థులకు ఇతర కంటి సమస్యలు ఉన్నట్లు తేల్చారు. ప్రభుత్వ పాఠశాలలతో పాటుగా ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు కంటి పరీక్షలు

ఏడాదికి 12 వేల కంటి శుక్ల శస్త్రచికిత్సలే లక్ష్యం : దృష్టి లోపం నివారించేందుకు పెద్దల్లో కంటి శుక్లాల పరీక్షలను ఉచితంగా చేస్తున్నారు. ఏడాదికి 12వేల లక్ష్యంగా పెట్టుకుని శస్త్రచికిత్సలు చేస్తున్నారు. అనకాపల్లి ఆసుపత్రితో పాటుగా శంకర్ ఫౌండేషన్, ఎల్వీ ప్రసాద్, గీతం, పాయకరావుపేటలోని హైమా నేత్రాలయం విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆసుపత్రిలో ఉచితంగా కంటి శుక్లాల పరీక్షలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.



అనకాపల్లి ఆసుపత్రిలో కంటి శుక్లాల శస్త్రచికిత్స



సకాలంలో కంటి లోపాలు గుర్తించాలి: దృష్టి లోపం సమస్యలు పెరుగుతున్నాయి. చిన్నారులు సెల్‌ఫోన్లు ఎక్కువగా చూడడం వల్ల దృష్టిలోపం వస్తుంది. ప్రభుత్వ పాఠశాలల చిన్నారులకు కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కంటి అద్దాలు అందిస్తున్నాం. అంధత్వం నివారించడంలో భాగంగా చర్యలు తీసుకుంటున్నాం. సకాలంలో దృష్టి లోపాన్ని గుర్తించి వైద్యం చేయించుకోవాలి. ఉచిత వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది.
– డాక్టర్ జీవీ రమణకుమార్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్, అనకాపల్లి

గంజాయి, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్పీల సమావేశంలో డీఐజీ గోపీనాథ్ జెట్టి

ఈనాడు, విశాఖపట్నం: గంజాయి రవాణా, సైబర్ నేరాల నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీలను డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. విశాఖ రేంజ్ కార్యాలయం నుంచి ఐదు జిల్లాల ఎస్పీలతో బుధవారం నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. రేంజ్ పరిధిలో ఎక్కడా గంజాయి సాగు లేకుండా చూడాలని, వాటిని పండించే రైతులు జీవనోపాధికి ప్రత్యామ్నాయ పంటలను సాగుచేసే విధంగా ప్రోత్సహించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు 'సంకల్పం' అనే కార్యక్రమం ద్వారా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అక్రమ రవాణాలో తరచూ పట్టుబడిన వారిపై పీడీ చట్టం ప్రయోగించాలన్నారు. దీపావళి పండగలో బాణసంచా విక్రయించే దుకాణాలు, గోదాములు తనిఖీలు చేసి భద్రతాప్రమాణాలు పాటిస్తుందీ లేనిదీ గుర్తించాలన్నారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. సైబర్ నేరాలపై 1930 ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరాలను నియంత్రించడంలో భాగంగా ప్రజలకు వాటిపై అవగాహన కల్పించాలన్నారు. డిజిటల్ అరెస్టు పేరుతో జరుగుతున్న మోసాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. సైబర్ మోసానికి గురైతే 1930 నంబరుకు ఫిర్యాదు చేసేలా ప్రచారం చేయాలన్నారు. బాలికలు, బాలురు అదృశ్యం కేసుల్లో అలసత్వం ప్రదర్శించకుండా కేసు నమోదైన వెంటనే వారి ఆచూకీ కనిపెట్టేలా ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని ఎస్పీలను ఆదేశించారు. సమావేశంలో అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్పీలు దీపిక, అమిత్‌బర్దార్, వకుల్ జిందాల్, కేవీ మహేశ్వరరెడ్డి, ఎస్వీ మాధవ్‌రెడ్డి పాల్గొన్నారు.



గోపీనాథ్ జెట్టి

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఇద్దరికి బంగారు పతకాలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ తైక్వాండో పోటీల్లో ఎలమంచిలికి చెందిన ఇద్దరు క్రీడాకారులకు బంగారు పతకాలు లభించాయి. ఈనెల 6 నుంచి 8 వరకు తిరుపతిలో రాష్ట్ర స్థాయి పోటీలు జరిగాయి. అండర్-17 విభాగంలో నగిరెడ్డి రోహిత్, పోలవరపు సుస్మితలకు బంగారు పతకాలు లభించాయి. ఈ సందర్భంగా తైక్వాండో ఫౌండర్ నగిరెడ్డి సత్యనారాయణ, అంతర్జాతీయ క్రీడాకారుడు కొణార దొరబాబు విజేతలను అభినందించారు. జాతీయ స్థాయిలో రాణించాలని వీరికి సూచించారు. జనసేన జిల్లా కార్యదర్శి కొణార నరేష్, తైక్వాండో క్లబ్ గౌరవ అధ్యక్షులు ఎస్. దొరబాబు, ఉపాధ్యక్షులు కూరగాయల బుచ్చి తదితరులు వీరిని అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్, హాకీ సంఘం ప్రతినిధులు

రెజ్లింగ్ పోటీల్లో గుండుపాల విద్యార్థిని ప్రతిభ

గొలుగొండ, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాల అండర్ 14-17 బాలికల రెజ్లింగ్ విభాగంలో గుండుపాల ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.వెంకటలక్ష్మి మంచి ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు విజయకుమార్ తెలిపారు. ఈ బాలిక ఈనెల 3 నుంచి 5 వరకు కృష్ణాజిల్లా నున్నలో జరిగిన రాష్ట్రపోటీల్లో పాల్గొని రజత పతకం సాధించినట్లు చెప్పారు. విద్యార్థినిని ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ్మూర్తి, సీనియర్ ఉపాధ్యాయులు ప్రకాష్‌రావు అభినందించారు.

ఆట్యా పాట్యా జాతీయ పోటీలకు ఎంపిక

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నం విద్యాంజలి పాఠశాల విద్యార్థులు ఆట్యాపాట్యా జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నెల్లూరులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బాలికల బృందానికి ద్వితీయ స్థానం దక్కింది. ఇందులోని ప్రతిభ కనబరిచిన కె.మధుప్రియ, ప్రియవర్షిణి, ఎస్.మధు 11 నుంచి పుదుచ్చేరిలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొననున్నారు. వీరిని పాఠశాల ఛైర్మన్ అక్బర్, కరస్పాండెంట్ శాంతి ప్రత్యేకంగా అభినందించారు.



విద్యార్థిని వెంకటలక్ష్మి



జాతీయ పోటీలకు ఎంపికైన మధుప్రియ, ప్రియవర్షిణి, మధు

కాలువ గట్టు కబ్జా

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ఆక్రమణలకు కాదేదీ అనర్హం అన్న రీతిలో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. అధికారుల కనుల ముందే కబ్జాల బాగోతాలకు తెరలేపుతున్నారు. లక్షలాది రూపాయల విలువచేసే భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా పాగా వేస్తున్నారు. తాజాగా పాయకరావుపేటలోని తాండవ చక్కెర కర్మాగారం వద్ద ఉన్న భూమి కాలువ పక్కన ఉన్న స్థలాన్ని దర్జాగా కబ్జా చేశారు. పాయకరావుపేట నుంచి నర్సీపట్నం వెళ్లే రహదారిని ఆనుకుని ఉన్న జలవనరుల శాఖ స్థలంలో షెడ్డు వేసి, దాని చుట్టూ రేకులతో ప్రహరీ నిర్మించేశారు. అంతేగాక వ్యాపారం చేసుకునేందుకు అద్దెకు ఇస్తున్నారు. ఇదంతా ప్రధాన రహదారి పక్కనే చోటు చేసుకుంది. కాలువ గట్టు సహా లక్షలాది రూపాయల విలువ జేసే భూమిలో తిష్ఠ వేయడంపై పలువురు బుధవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై జలవనరులశాఖ ఏఈ శ్రీరామ్మూర్తిని వివరణ కోరగా స్థలం కబ్జా వాస్తవమేనన్నారు. తక్షణమే వీటిని తొలగిస్తామని చెప్పారు.



జల వనరుల శాఖ స్థలంలో షెడ్డు



రేకులతో ప్రహరీ

గ్రానైట్ క్వారీకి అనుమతులు ఇవ్వొద్దు

స్పష్టం చేసిన గిరిజనులు

రావికమతం, న్యూస్‌టుడే: కొట్నాబిల్లి రెవెన్యూలో గ్రానైట్ క్వారీ తవ్వకాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతులు ఇవ్వొద్దని గిరిజన గ్రామాల ప్రజలు, ప్రజాసంఘాల నాయకులు నిరసన తెలిపారు. కొట్నాబిల్లి రెవెన్యూ పరిధి సర్వే నెంబరు-1లోని 3.219 హెక్టార్ల భూమిలో క్వారీ అనుమతుల కోసం ఆశ్రిత ఎంటర్ ప్రైజెస్ సంస్థ దరఖాస్తు చేసుకుంది. ప్రజాభిప్రాయ సేకరణకు నర్సీపట్నం ఆర్‌డీఓ వి.వి.రమణ, కాలుష్య నియంత్రణ మండలి జేఈ కరుణ కుమారి, తహసీల్దారు వెంకటరమణ సమక్షంలో బుధవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. కొట్నాబిల్లి, కె.గదబపాలెం, పాత కొట్నాబిల్లి, రామన్నదొరపాలెం గిరిజన గ్రామాల మహిళలు, ఎస్టీ, ఎస్సీ యువకులు ఈ సభకు హాజరై క్వారీ ఏర్పాటును వ్యతిరేకించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములు మాట్లాడుతూ కొట్నాబిల్లి రెవెన్యూలో ఇప్పటికే 15 క్వారీలు ఉన్నాయని గుర్తు చేశారు. క్వారీల వల్ల నష్టమే తప్ప తమకు ఎలాంటి లాభం ఉండటం లేదని, స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని చెప్పారు. తాగునీరు కలుషితం అవుతోందని, వాయుకాలుష్యంతో వ్యాధుల బారిన పడుతున్నామని చెప్పారు. క్వారీ నుంచి వచ్చే దుమ్ము, ధూళితో పంటలు పండటం లేదని గిరిజన, దళిత యువకులు అప్పలరాజు, కన్నయ్య చెప్పారు. క్వారీల్లోని గ్రానైట్‌ను గ్రానైట్‌ను తరలించుకుపోవడమే తప్ప రోడ్లపై గోతులను బుగ్గివేసి కూడా పూడ్చటం లేదని గదబపాలెం గిరిజనులు ఈదల అప్పలనాయుడు తదితరులు చెప్పారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందరావు మాట్లాడుతూ క్వారీల కారణంగా గిరిజనులు, గిరి గ్రామాలకు తీవ్ర నష్టం జరుగుతున్నందున కొత్తగా అనుమతి ఇవ్వరాదని కోరారు. ప్రజాభీష్టానికి విరుద్ధంగా అనుమతులు ఇస్తే ఊరుకునేది లేదని తెగేసి చెప్పారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఆసరి వాసు గోవిందరావు, మరికొందరు క్వారీ ఏర్పాటును స్వాగతిస్తున్నట్లు అధికారులకు స్పష్టం చేశారు. దీంతో వ్యతిరేక వర్గీయుల నుంచి ప్రతిఘటన ఎదురైంది. క్వారీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గిరిజన మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. మెజారిటీ ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవడంతో క్వారీ విషయంలో ఎటువంటి నిర్ణయం తీసుకోకుండానే అధికారులు వెనుదిరిగారు. గ్రామసభలో గొడవలు జరగకుండా కొత్తకోట సీఐ పర్యవేక్షించారు. రావికమతం ఎస్.ఐ. రఘువర్మ ఆధ్వర్యంలో 30 మందికి పైగా పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.



ఖాళీ బిందెలతో నిరసన

21 కేజీల గంజాయి స్వాధీనం

దేవరాపల్లి, న్యూస్‌టుడే: పినకోట - దేవరాపల్లి మార్గంలో కారులో గంజాయి తరలిస్తున్న ముగ్గురిని బుధవారం శ్రీరాంపురం కూడలి వద్ద పట్టుకున్నట్లు ఎస్ఐ టి.మల్లేశ్వరరావు తెలిపారు. వారి నుంచి కారుతోపాటు 21 కేజీల గంజాయి, రూ. 2600 నగదు, ఒక సెల్‌ఫోను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కాకినాడ నగరానికి చెందిన బొడ్డపాటి తేజ కిరణ్, పులపాకాళి కిరణ్ దత్త సాయి, చెవ్వాకుల రేణుక కలిసి పెదబయలు మండలం జామిగుడ గ్రామ సరిహద్దులోని ఒడిశాలో 21 కేజీల గంజాయి కొనుగోలు చేశారు. దీన్ని పినకోట, దేవరాపల్లి మీదుగా కారులో వస్తున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. సిబ్బందితో కలిసి శ్రీరాంపురం వద్ద కాపలా కాశామన్నారు. అదే సమయంలో వస్తున్న కారుని సోదాచేసి అందులో ఉన్న గంజాయి స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి, నిందితులను చోడవరం కోర్టులో హాజరు పర్చామన్నారు.



కారులో గంజాయి తరలిస్తు పట్టుబడిన నిందితులతో ఎస్ఐ మల్లేశ్వరరావు, సిబ్బంది

మహిళా ఉద్యోగిని బెదిరించిన కేసుపై ముమ్మర విచారణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో పట్టపగలే మహిళా ఉద్యోగిని కత్తితో బెదిరించి రూ 1.80 లక్షల నగదు కాజేసిన మహిళా నిందితులను పట్టుకోడానికి పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈనెల 5న జాతీయ రహదారిపై నిత్యం రద్దీగా ఉండే ప్రాంతంలో జరిగిన దాడి దోపిడీ అందరిలో ఆందోళనలు రేకెత్తించింది. అదే రోజు పూడిమడక రోడ్డులోని మరో మహిళను బెదిరించి 9 తులాల బంగారు వస్తువులను దుండగులు కాజేశారు. ఈ కేసుకు సంబంధించి అనకాపల్లి పట్టణ పోలీసులు ముగ్గురు మహిళలు, ఆటో డ్రైవర్‌ను మంగళవారం అరెస్ట్ చేశారు. ఇదే రోజున ఆటో డ్రైవర్ మేకల హరి మరో ఇద్దరు మహిళలతో కలిసి ఏపీ జెన్‌కోలో పనిచేస్తున్న చెక్కా సుధ అనే మహిళను ఆటో ఎక్కించుకుని కత్తితో బెదిరించి రూ. 1.90 లక్షలు కాజేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితులుగా ఇద్దరు మహిళలను పోలీసులు గుర్తించారు. వీరు పరారీలో ఉండడంతో పోలీసులు గాలిస్తున్నారు.

మినీ వ్యాన్ ఢీకొని ఒకరి మృతి

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: జాతీయ రహదారిపై పెనుగొల్లు వద్ద మినీ వ్యాన్ ఢీకొని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై విభీషణరావు తెలిపారు. సోమదేవుపల్లికి చెందిన భీమరాజు అప్పారావు (46) బుధవారం సాయంత్రం ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా, తునివైపు నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న మినీ వ్యాన్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. అప్పారావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



అప్పారావు (పాత చిత్రం)

25 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి మండలం వెదుళ్లపాలెం వద్ద అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని పట్టుకున్నట్లు సీఐ కుమారస్వామి తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు సమాచారం అందడంతో, ఎస్సై విభీషణరావు సిబ్బంది కలిసి దాడిచేసి, గుళ్లపాడు నుంచి విశాఖ వైపు వెళ్తుండగా వెదళ్లపాలెం వద్ద పట్టుకున్నారన్నారు. మధ్యవర్తుల సమక్షంలో లారీలో ఉన్న సరకును తనిఖీ చేయగా, పీడీఎస్ బియ్యంగా గుర్తించామన్నారు. లారీని సీజ్ చేసి, కేసు నమోదు చేసి, తదుపరి చర్యలకు రెవెన్యూ అధికారులకు అప్పగించామని సీఐ వెల్లడించారు.



పోలీసులు పట్టుకున్న లారీ

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	115	110
లైవ్	137	130
డ్రెస్‌డ్	199	230
స్కిన్‌లెస్	226	240

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

భాజపా సంబరాలు



సంబరాల్లో నాయకులు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: హరియాణలో భాజపా విజయం సాధించడంతో పట్ల అనకాపల్లిలో ఈ పార్టీ నాయకులు బుధవారం వేడుకలు చేసుకున్నారు. భాజపా అసెంబ్లీ కన్వీనర్ బొడ్డేడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మిఠాయిలు పంచి బాణసంచా కాల్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై నమ్మకం, భాజపాపై విశ్వాసంతో హరియాణ ప్రజలు మూడోసారి పట్టం కట్టారని పేర్కొన్నారు. నాయకులు కొణతాల అప్పలరాజు, వి.రమేశ్, జి.స్వరూప్, భక్తసాయిరాం పాల్గొన్నారు.

అ వీ ఇ వీ

■ అచ్యుతాపురం తహసీల్దార్‌గా జనార్దన్



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అచ్యుతాపురం తహసీల్దార్‌గా జీవీ జనార్దన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానన్నారు. ఉపతహసీల్దార్ శ్యామ్, ఆర్ఐ కుమార్, వీఆర్వోలు శశి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

■ బోరు పనులు ప్రారంభం

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: వల్లూరులో బుధవారం తాగునీటి బోరు పనులను మహిళా సాధికార భవనం వద్ద తెదేపా వార్డు ఇన్‌ఛార్జి కొణతాల భాస్కర్ ప్రారంభించారు. మాజీ సర్పంచి సత్యనారాయణ, ముసిలినాయుడు, దుంగ ఈశ్వరరావు, దుంగ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

■ గర్భిణులకు పోషకాహారం అందజేత

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పోషకాహారం అందజేశారు. వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ఆహార పొట్లాలు పంచారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ ఏడాది నుంచి ప్రతినెలా 9న వైద్య పరీక్షలకు వచ్చే గర్భిణులకు క్రమం తప్పకుండా పోషకాహారం అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కె.నూకరాజు, ఎం.శ్రీరామ్మూర్తి, జయప్రకాశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఆహార పొట్లాం అందజేస్తున్న సభ్యులు

వుషూలో అదుర్స్
గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతోంది ఆదరణ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే



చైనా మార్షల్ ఆర్ట్స్ వుషూ నేర్చుకోవడంపై యువత ఆసక్తి చూపుతున్నారు. బాక్సింగ్, కిక్‌బాక్సింగ్, కుస్తీ మూడు కలగలిపి ఆడే ఈ క్రీడలో రాణించి సత్తా చాటుతున్నారు. ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో అనకాపల్లికి చెందిన తులసీరామ్, లక్షిత్, వరప్రసాద్, యువరాజ్, వినయ్ ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెలాఖరులో శ్రీకాకుళంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. అక్కడ ప్రతిభ చూపిన విద్యార్థులను జమ్మూ కశ్మీర్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు. పోటీల్లో రాణించేలా క్రీడాకారులు సాధన చేస్తున్నారు.

ఆదరణ పెరుగుతుంది



ఈ క్రీడ చైనాలో ప్రాచుర్యం పొందింది. ఇక్కడ దీన్ని నేర్చుకునేవారు కాదు. మారేడుపూడిలో కోచ్ హరీష్ సహకారంతో ఈ క్రీడలో చాలామంది విద్యార్థులు తర్ఫీదు పొందుతున్నారు. కుస్తీ, బాక్సింగ్, కిక్‌బాక్సింగ్‌లోని మెలకువలను మేళవించి ఈ క్రీడలో ప్రత్యర్థిని మట్టి కరిపించొచ్చు.

– ఎ.వినయ్, తొమ్మిదో తరగతి

చదువుతూనే క్రీడలో రాణించేలా..



వుషూ క్రీడపై ఆసక్తితో రెండేళ్ల నుంచి సాధన చేస్తున్నాను. ఆత్మరక్షణ కోసం నేర్చుకున్న విద్య పతకాలు సాధించేలా చేసింది. జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాను. గతంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో రజత పతకం సాధించా.

– ఎ. వరప్రసాద్, తొమ్మిదో తరగతి, అనకాపల్లి

ఆత్మవిశ్వాసం పెరుగుతుంది



ఈ క్రీడలో తర్ఫీదుతో ఆత్మవిశ్వాసం పెంపొందుతుంది. శరీరానికి మంచి వ్యాయామంతో పాటుగా చురుగ్గా ఉండడానికి దోహదపడుతుంది. గ్రామీణ ప్రాంతాల నుంచి ఎంతో మంది దీనిలో రాణిస్తున్నారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికై పతకం సాధించాలన్న లక్ష్యంతో సాధన చేస్తున్నాను.

– కె.యువరాజ్, పదో తరగతి విద్యార్థి

వంతెనపై పొంచి ఉన్న ప్రమాదం



వంతెనపై దెబ్బతిన్న రక్షణ వాల్

దర్పణం

పాయకరావుపేట మండలంలోని వెంకటనగరం- అద్దరిపేట ప్రధాన మార్గంలో పంపా నదిపై నిర్మించిన వంతెనకు రక్షణ గోడ దెబ్బతింది. దీంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. దీనిపై రాకపోకలు చేసే గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఈ వంతెనపై నుంచి ఆటో అదుపు తప్పి నదిలో పడిపోయింది. ఈ సమయంలో రక్షణగోడ కూలిపోయింది. అప్పటి నుంచి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో మిగిలిన రెయిలింగ్‌లు దెబ్బతిన్నాయి. ఈ మార్గంలో కాకినాడ పోర్టు నుంచే వచ్చే భారీ వాహనాలు, డెక్కన్ పరిశ్రమకు ముడి సరకు తరలించే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అదుపు తప్పితే నదిలోకి దూసుకుపోయే పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు సమస్యపై స్పందించి వంతెనపై రక్షణకు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

– పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ఆరా



నర్సరీని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

నక్కపల్లి, న్యూస్‌టుడే: రమణయ్యపేటలో కేంద్ర బృందం సభ్యులు అనిల్ గైక్వాడ్, అనిల్ నింబోద్కర్ బుధవారం పర్యటించారు. నర్సరీలు, ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులను పరిశీలించారు. ఉపాధి హామీ పనులు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయనే దానిపై కూలీలను అడిగి తెలుసుకున్నారు. వీరితోపాటు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శచీదేవి, అదనపు డైరెక్టర్ డైజీ, ఎంపీడీఓ సీతారామరాజు, డీపీఎం శ్రీనివాస్, ఏపీఎం శ్రీనివాసరావు, సత్యవేణి, సర్పంచి వరహాలరావు, ఎంపీటీసీ సభ్యుడు గోవిందరావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: అనకాపల్లి శారదాబ్రిడ్జి రహదారి మరమ్మతులకు గురైంది. గోతులు వెంటనే పూడ్చాలి. – ప్రసాద్, అనకాపల్లి

సమాధానం: మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తాం. – ప్రభు, ఆర్‌అండ్‌బీ ఏఈ

ఆకట్టుకున్న ప్రదర్శన

అనకాపల్లి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలలో భాగంగా స్థానిక నిదానందొడ్డిలోని కామాక్షిదేవి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సురభి నాటకాలను బుధవారం రాత్రి తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. వీవీ రమణ రైతు భారతి భవనంలో పాతాళభైరవి నాటకాన్ని ప్రదర్శించారు. ఉత్సవ కమిటీ ప్రెసిడెంట్ కోటిపల్లి శ్రీను, ఉపాధ్యక్షులు కొండ్రాకుల సతీష్, కోశాధికారి పొన్నాడ నరసింహచారి, కన్వీనర్ పందారు సత్యనారాయణ పాల్గొన్నారు.



నాటికలోని ఓ సన్నివేశం

దేవాలయాల్లో నిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలు

మునగపాక, న్యూస్‌టుడే: దేవాలయాల్లో నిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగించాలని సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర ధర్మ ప్రచారకులు ఆడారి గంగాధర్ అన్నారు. జడ్పీ పాఠశాలలో బుధవారం సమరసత సేవా ఫౌండేషన్ గ్రామ కన్వీనర్లకు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలతోనే ప్రశాంతత కలుగుతుందన్నారు.

సరస్వతీదేవిగా కనకదుర్గ



సతకంపట్టులో పూజల్లో పాల్గొన్న పీలా



మునగపాకలో..



కల్యాణగిరిలో..

అనకాపల్లి పట్టణం, కొత్తూరు, కశింకోట, న్యూస్‌టుడే: సతకంపట్టులో కనకదుర్గ అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవ విగ్రహంతో రథోత్సవం నిర్వహించారు. అమ్మవారిని మాజీ ఎమ్మెల్యే బుద్ధ నాగజగదీశ్వరరావు దర్శించుకున్నారు. లక్ష్మీదేవిపేట, విజయరామరాజుపేట, నర్సింగరావుపేటల్లోని కనకదుర్గ అమ్మవార్లను మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ దర్శించుకున్నారు. నాయకులు పోలారపు త్రినాథ్, యల్లపు సత్తిబాబు, పిట్ల రాజు, దాడి జగన్ పాల్గొన్నారు. కన్యకాపరమేశ్వరి భద్రకాళిగా, కశింకోటలో సర్వమంగళాంబ జ్ఞానప్రసాదిని అలంకరణలో దర్శనమిచ్చారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు ప్రసాదంగా అందజేశారు. సత్యనారాయణపురం కల్యాణగిరిపై కనకదుర్గమ్మను సరస్వతీదేవిగా అలంకరించారు. కల్యాణగిరితో పాటు మార్గాల్లో అమ్మవార్లను తెదేపా జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్ దంపతులు పూజలు చేశారు.

మునగపాక, న్యూస్‌టుడే: శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో దుర్గాదేవిని బుధవారం సరస్వతీదేవిగా అలంకరించారు. దుర్గాదేవి విగ్రహాల వద్ద విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. ప్రత్యేక పూజలు చేశారు. చిన్న పిల్లలతో అక్షరాభ్యాసం చేశారు. ఎస్సీకాలనీలో బుధవారం రాత్రి అంబలం పూజ నిర్వహించారు. వందలాది మంది భవాని భక్తులు పాల్గొన్నారు.



ఎలమంచిలిలో..

ఎలమంచిలి, అచ్యుతాపురం: ఎలమంచిలి వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సామూహిక సరస్వతీ దేవి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు నిర్వాహకులు నేతి సురేష్ తదితరులు పాల్గొన్నారు. దిమిలిలో శ్రీ పైడితల్లి ఆలయంలో అంబలం పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

పాయకరావుపేట/గ్రామీణం, ఎస్.రాయవరం, నక్కపల్లి, కోటవురట్ల, న్యూస్‌టుడే: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో దుర్గమ్మ చెట్టు వద్ద భక్తిశ్రద్ధలతో సరస్వతీ పూజ చేశారు. మంగవరం గ్రామంలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 101 మంది విద్యార్థులతో కుంకుమ పూజలు చేయించారు.



పాయకరావుపేటలో..

తిమ్మాపురంలో సుమారు 70 మంది విద్యార్థులకు దమ్ము రాజు దంపతులు, చినదొడ్డిగల్లులో లక్ష్మీనారాయణ, రతీదేవి దంపతులు రాత పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు, పరీక్ష అట్టలు అందించారు. గొల్లపేటలో దుర్గాదేవి అమ్మవారి సారెను కనకదుర్గా యూత్ ఆధ్వర్యంలో భక్తులు ఊరేగించారు. వివిధ రకాల పిండివంటలు తీసుకొచ్చి అమ్మవారి పాదాల వద్ద ఉంచారు.



నక్కపల్లిలో..



అనకాపల్లి కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు



సరస్వతీ దేవిగా..



భద్రకాళి అలంకరణలో..



పిసినికాడలో..



కశింకోటలో..



గొల్లపేటలో సారె ఊరేగింపు

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు



పొలంలో ఏఓ స్వప్న, రైతులు

కశింకోట, మునగపాక, న్యూస్‌టుడే: ప్రతి రైతు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయ శాస్త్రవేత్త ఆదిలక్ష్మి సూచించారు. కశింకోట, అచ్చెర్ల గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు ప్రభుత్వం అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఓ స్వప్న, పశువైద్యాధికారిణి డయానా, నాయకులు పాల్గొన్నారు.

మునగపాక మండలం పాటిపల్లిలో ఏఓ సీహెచ్.జ్యోత్స్నకుమారి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

జాతీయ ప్రతిభా ఉపకారవేతనాలకు అర్హత సాధించండి



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట డీపీఎన్ ఉన్నతపాఠశాలలో స్పందించే హృదయం ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ ప్రతిభా ఉపకార వేతనం ఉచిత శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. వీరికి నిర్వహించిన నమూనా పరీక్షలో 15 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరికి బహుమతులు అందజేశారు. ప్రతినిధులు ఆచంట నాగేశ్వరరావు, డి.నూకేష్, కొణతాల సోమశేఖర్, ఎస్.రమేష్, ఎం.వై.రాము తదితరులు పాల్గొన్నారు.

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక జిల్లా పరిషత్తు ఉన్నతపాఠశాలలో గత పదిరోజులుగా స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచితశిక్షణ శిబిరంలో స్పందించే హృదయం ఛారిటబుల్ ట్రస్టు గౌరవాధ్యక్షులు కేవీ రమణ పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. మళ్ల జోగారావు, కోర్సు డైరెక్టరు ఎం. సత్యనారాయణమూర్తి, కొణతాల సోమశేఖర్, పిల్లా జగదీష్, మాడెం జోగారావు, ఎం.వై.రాము డి.నూకేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: దిబ్బపాలెంలో బుధవారం వేంకటేశ్వర స్వామి కల్యాణం కనులపండువగా సాగింది. తెదేపా జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు పాల్గొన్నారు.



కల్యాణ ఉత్సవంలో రత్నాకర్‌తో నిర్వాహకులు

చే గువేరా విప్లవయోధుడు



చిత్రపటానికి నాయకుల నివాళి

రాంబిల్లి, న్యూస్‌టుడే: విప్లవ యోధుడు చే గువేరా ప్రపంచానికే కొత్తశక్తిని ఇచ్చిన నేత అని సీఐటీయూ నాయకులు కొనియాడారు. గజిరెడ్డిపాలెంలో బుధవారం చే గువేరా వర్ధంతిని నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జి.దేముడు నాయుడు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సీహెచ్.శివాజీ, నాయకులు వై.రాము, చేపల చిట్టిబాబు, చెల్లూరి నూకరాజు, ఎరిపల్లి చక్రవర్తి, ఎరిపల్లి చిరంజీవి, వెంకటేశ్, రాజేశ్వరి, నూకరత్నం పాల్గొన్నారు.

నమ్ముకున్న వారికి గుర్తింపు



తాతయ్యబాబును సత్కరిస్తున్న బుద్ధ

అనకాపల్లి, న్యూస్‌టుడే: పార్టీని నమ్ముకున్న వారికి తగిన గుర్తింపు ఎప్పుడు లభిస్తుందని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు తెలిపారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన తెదేపా జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబును బుధవారం వడ్డాదిలో సత్కరించారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, పార్టీ పట్టణశాఖ అధ్యక్షులు కోట్ని రామకృష్ణ, కాండ్రేగుల గోపీకృష్ణ పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల పరుగు

అనకాపల్లి, న్యూస్‌టుడే

'ముంపునకు గురైన పొలాల్లో నీరు తగ్గిన వెంటనే పంట త్వరగా కోలుకోడానికి ఎకరాకు 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ వేసుకోవాలి. చెరకు తోటలకు 25 కేజీల యూరియా, 25 కేజీలు పొటాష్ వాడాలి' తుపాను సమయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పంటపొలాల వద్దకు వెళ్లి రైతులకు చేసిన సూచనలు ఇవీ.

ఇప్పుడు పంట పొలాల్లో నీరు తగ్గింది. చాలా చోట్ల వరి పంట పొట్ట దశకు చేరుకుంది. దీంతో రైతులు యూరియా వేసేందుకు సిద్ధమైనా రైతు సేవా కేంద్రాలు, సొసైటీల్లో కొన్ని చోట్ల ఎరువులు లేవనే సమాధానం వస్తోంది. అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి, పాయకరావుపేట, నర్సీపట్నం వంటి ప్రాంతాల్లో డీలర్ల వద్ద యూరియా పుష్కలంగా ఉన్నా అంత దూరం రైతులు వెళ్లలేకపోతున్నారు. జిల్లాలో వరి 54,493 హెక్టార్లలో, చెరకు 7,316 హెక్టార్లలో సాగు చేస్తున్నారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశకు చేరుకున్న సమయంలో ఎరువులు అవసరం. మొక్క చెరకు తోటలకు ఎరువులు వేస్తారు. గత వారం రోజులుగా జిల్లా వ్యాప్తింగా పంటలకు ఎరువులు వేయడం ప్రారంభించారు. ఒక్క సారిగా రైతులు రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల వద్దకు పరుగులు తీస్తున్నారు. దీంతో కొన్ని చోట్ల ఎరువుల కొరత ఏర్పడింది. జిల్లాలో అన్ని రకాల ఎరువులు కలిపి 35,253 టన్నులు అవసరం. ఇంత వరకు 32,434 టన్నులు సరఫరా చేశారు. దీనిలో యూరియా 23 వేల టన్నులు. డీఏపీ, ఎంవోపీ, ఎన్‌పీకె, ఎస్ఎస్‌పీ ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి.



అచ్యుతాపురం: రైతులకు ఎరువులు, మందులు పూర్తి స్థాయిలో అందించాలని కూటమి ప్రభుత్వం చెబుతున్నా క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడంలేదు. రైతు సేవా కేంద్రాల్లోనూ యూరియా లభించలేదు. రైతు సహకార సంఘాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎరువుల లభించక రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్దకు పరుగులు తీసే పరిస్థితి నెలకొంది. ఎలమంచిలి నియోజకవర్గంలో 90 వరకు రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. పలు కేంద్రాల్లో యూరియా లేదు. అచ్యుతాపురం మండలంలో 1600 ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నారు. పంటకు ఎరువులు వేయడానికి ఇదే అనువైన సమయం. అచ్యుతాపురం మండలంలో యూరియా దొరకని పరిస్థితి నెలకొంది. వరి పొట్టదశలో ఉన్న సమయంలో యూరియా వేయకపోతే దిగుబడిలో నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొట్టదశ ముందు యూరియా అందకుంటే దిగుబడిలో చాలా తగ్గిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

నక్కపల్లి: రైతులు తమ వివరాలను సమర్పించి, వేలి ముద్రలు వేస్తే సాగుకు అనుగుణంగా వీటిని సిబ్బంది అందిస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో రైతు సేవా కేంద్రాలన్నింటిలో కలిపి అధికారులు ఇంత వరకు 508 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ 57, పొటాష్ 34 టన్నులు అందుబాటులో ఉంచారు.



ఎరువులు తీసుకెళుతున్న రైతులు

సొసైటీల్లో యూరియా లేదు



రైతు సేవా కేంద్రాల్లో, సొసైటీల్లో ఎరువులు లేక ఇబ్బంది పడుతున్నాం. ప్రైవేటు డీలర్లు రూ.100 నుంచి రూ.200 వరకు అదనంగా వసూళ్లు చేస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. – శరగడం రమణబాబు, రైతు, తిమ్మరాజుపేట

వారం రోజుల్లో 50 టన్నుల యూరియా సరఫరా

ఖరీఫ్ సీజన్‌కు 450 టన్నులు యూరియా అవసరమని అంచనా వేశాం. ఇప్పటికే 260 టన్నులను సరఫరా చేశాం. పెదపాడు, తిమ్మరాజుపేట, హరిపాలెం, కొండకర్ల, ఉప్పవరం రైతు సేవా కేంద్రాల్లో వారం రోజుల్లో 50 టన్నులు అందుబాటులో ఉంచుతాం. ఇప్పటివరకు సొసైటీలకు 100 టన్నులు వచ్చింది. డీలర్లకు 50 టన్నులు కేటాయించాం.

– గోవింద శంకర్, ఏఓ

కొరత రానివ్వం



జిల్లాలో ఎరువుల కొరత లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం 2,600 టన్నులు యూరియా అందుబాటులో ఉంది. దీనిలో 700 టన్నులు పీఏసీఎస్‌లు, మరో 700 టన్నులు రైతు కేంద్రాల్లో, మిగిలింది ప్రైవేటు డీలర్లు వద్ద ఉన్నాయి. రెండు రోజులలో మరో 500 టన్నులు వస్తుంది. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే ఎరువులు వేసుకోవాలి.

– బి.మోహనరావు, జిల్లా వ్యవసాయాధికారి, అనకాపల్లి

వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: వాలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ అనకాపల్లిలో బుధవారం ఆందోళన ప్రదర్శన చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నాయకులు వీవీ శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వాలంటీర్లకు రూ. 10 వేల జీతం. ఉద్యోగ భద్రత కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

డిజిటల్ లావాదేవీలపై అవగాహన



సమావేశంలో అవగాహన కల్పిస్తున్న బ్యాంకు మేనేజర్ సుబ్రహ్మణ్యం

నర్సీపట్నం: మున్సిపాలిటీలో పీఎం స్వనిధి రుణాలు పొందిన వీధి వ్యాపారులకు స్థానిక మెప్మా కార్యాలయంలో బ్యాంకర్లు బుధవారం డిజిటల్ లావాదేవీలపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. నగదురహిత వాణిజ్యంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. దుకాణాలు, తోపుడుబళ్ల వద్ద క్యూ ఆర్ కోడ్ స్కానర్ల ఏర్పాటు, ఫోను ద్వారా రుణ బకాయిలు చెల్లించడం తదితర విషయాలను వీరు వివరించారు. పట్టణంలోని వివిధ బ్యాంకుల మేనేజర్లు, మెప్మా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

డొంకాడ గిరిజనులకు ఇళ్ల పట్టాలివ్వాలి

గొలుగొండ, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి గుడిసెల్లోనే నివాసం ఉంటున్న ఆదివాసీ గిరిజనులకు ప్రభుత్వం పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎ.రాజు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తఎల్లవరం శివారు డొంకాడలో నిర్వహించిన సమావేశానికి హాజరై మాట్లాడారు. గత సర్కారు వీరు జీవనోపాధి పొందుతున్న ప్రాంతానికి దూరంగా పట్టాలు ఇవ్వడంతో ఇంటి నిర్మాణాలకు ఆసక్తి చూపలేదన్నారు. వీరికి బతుకుతెరువు ఉన్నచోటే నీడ కల్పించాలని కోరారు.

ఎక్సైజ్ సీఐగా మధుకుమార్

గొలుగొండ, న్యూస్‌టుడే: గొలుగొండ ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ సీఐగా మధుకుమార్ బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. నాటుసారా తయారీ, మద్యం గొలుసు దుకాణాలకు అడ్డుకట్ట వేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తామని నూతన సీఐ వెల్లడించారు.

ఎటూతేలని ఇసుక దుమారం!

న్యాయస్థానానికి చేరిన వ్యవహారం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

నర్సీపట్నం గబ్బాడ యార్డులో ఇసుక నిల్వ వ్యవహారం మరో మలుపు తిరిగింది. గుత్తేదారు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పరిష్కారానికి మరి కొన్నాళ్లు ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. పర్యావరణ అనుమతులు తీసుకోకుండా గోదావరి నదిలో ఇసుక తవ్వి తీసుకొచ్చి గబ్బాడలో నిల్వ చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమని పేర్కొంటూ రూ. 18,70,96,560 జరిమానా కట్టమంటూ ప్రతిమ సంస్థ గుత్తేదారుకు గతనెల పన్నెండున గనులశాఖ అధికారులు నోటీసులిచ్చారు. నెల రోజుల్లోగా దీనికి సమాధానం ఇవ్వాలని అధికారులు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. దీనిపై గుత్తేదారు తాజాగా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగస్టు ఎనిమిది నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక ఉచితంగానే సరఫరా ఇస్తున్నా గబ్బాడలో మాత్రం మొదలు కాలేదు. ఇక్కడ ఇసుక అక్రమంగా నిల్వ చేశారని, విచారణ చేసి బాధ్యులపై కేసు నమోదు చేయాలని సభాపతి అయ్యన్న ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారం తేలిన తరువాతనే పంపిణీ చేయాలని ఆయన సూచించారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన గనులశాఖ అధికారులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. 2024 ఫిబ్రవరి, మే నెలల మధ్య పర్యావరణ అనుమతులు ఏవీ లేకుండానే ఇసుక తవ్వారని గుర్తించి గుత్తేదారుకు నోటీసు ఇచ్చారు. పర్యావరణ అనుమతులకు సంబంధించిన పత్రాలన్నీ మీ వద్దనే ఉన్నాయని, మా తప్పిదం ఏదీ లేదని గుత్తేదారు తెలియజేసినా సంతృప్తి చెందని అధికారులు జరిమానా నోటీసు ఇచ్చారు. దీన్ని అందుకున్న గుత్తేదారు ఇప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.



గబ్బాడ యార్డులో నిల్వ చేసిన ఇసుక



ఇతర అవసరాలకు మూటల్లో సిద్ధం చేసిన ఇసుక

గబ్బాడలో 48,204 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందని గనులశాఖ అధికారులు ఆగస్టు మొదటి వారంలో అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదించారు. ఇసుక తస్కరణకు గురికాకుండా సచివాలయం, పోలీసు సిబ్బందిని కాపలా ఉంచారు. సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. గుత్తేదారు కోర్టుకు వెళ్లిన నేపథ్యంలో ఇక్కడి నిల్వలు ఏం చేయాలన్నది కలెక్టర్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. స్థానికంగా ఇసుక అందుబాటులో లేకపోవడం అక్రమార్కులకు వరంగా మారింది. వాల్టా చట్టం మార్గదర్శకాలకు విరుద్ధంగా... ఎలాంటి అనుమతులు లేకుండానే నదులు, గెడ్డల్లో పెద్దఎత్తున తవ్వేస్తున్నారు.

సాగు, తాగునీటి కట్టడాలకు ముప్పు కలిగించేలా వ్యవహరిస్తున్నారు. ఈ వ్యవహారం రాజకీయ దుమారానికి దారి తీస్తోంది. ఇసుక సరఫరా మొదలు పెట్టాలని ఈనెల 21న ర్యాలీ, ధర్నా నిర్వహించేందుకు వైకాపా నాయకులు నిర్ణయించారు. ఈ విషయాన్ని ఆర్‌డీఓ, సీఐల దృష్టికి ఆ పార్టీ నాయకులు తీసుకువెళ్లారు. ఇసుక వ్యవహారంలో గత ప్రభుత్వం తప్పిదాలను తెదేపా నాయకులు మీడియా సమావేశాల్లో ఎండగడుతున్నారు. మొత్తంమీద వివాదం న్యాయస్థానానికి చేరడంతో పరిష్కారం ఎప్పుడన్నది ప్రశ్నార్థకంగా మారింది.

ఎక్కడి పనులు అక్కడే.. ఎప్పటికి పూర్తయ్యేనో!

రోలుగుంట, న్యూస్‌టుడే

లోఓల్టేజీ, అప్రకటిత విద్యుత్తు కోతలు తదితర సమస్యలను పరిష్కరించేందుకు చేపట్టిన పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. విజయవాడలోని బుడమేరు ప్రభావిత ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టేందుకు జిల్లా నుంచి సిబ్బందిని, ఒప్పంద కార్మికులను తీసుకువెళ్లడంతో ఇక్కడి పనులను నిలిపివేశారు. నర్సీపట్నం సబ్ డివిజన్‌లో కొత్త స్తంభాల ఏర్పాటు, తీగలు లాగే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రోడ్డు పక్కనే వదిలేసిన స్తంభం



తీగలను వదిలేశారిలా..

భగవద్గీత పారాయణంతో ప్రయోజనం

నాతవరం, న్యూస్‌టుడే: భగవద్గీత పారాయణం ప్రయోజనాలను గుర్తించాలని ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక రాజమండ్రి కమిటీ ఉపాధ్యక్షుడు బి.శాంతిరాజు కోరారు. నాతవరం మండలం వెంకయ్యపాలెం, చెర్లోపాలెం, తాండవ కూడలి, గన్నవరం గ్రామాల్లో బుధవారం ఈ సంస్థ సభ్యులు పర్యటించి పురాణ, ఇతిహాసాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ప్రస్తుత కాలంలో జ్ఞాన ప్రచురణలను వెలుగులోకి తేవడం అవసరమని పేర్కొన్నారు. అనంతరం ఈ గ్రామాల్లో ఆధ్యాత్మిక గ్రంథాల పరిచయ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో దావులూరి సత్యనారాయణ రాజు, మూర్తి సత్యవతి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు.



భగవద్గీత పుస్తకాలతో మహిళలు, సంస్థ ప్రతినిధులు

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకన్య ఆడి1: **సత్యం సుందరం, వెట్టియన్** ఆడి2: **శ్వాగ్** ఆడి3: **దేవర,** ఆది4: **వెట్టియన్** రాజు: **వెట్టియన్,** బంగార్రాజు: **దేవర**
చోడవరం: శ్రీసాయిలక్ష్మి: **సత్యం సుందరం,** సాయిలక్ష్మి: **వెట్టియన్,** పూర్ణా: **దేవర**

అవీ ఇవీ

కస్తూర్బాలో ఉద్యోగావకాశాలు

మాకవరపాలెం: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న టైప్-4 కస్తూర్బా విద్యాలయంలో హెడ్‌కుక్, సహాయకురాలి పోస్టులు భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి మూర్తి తెలిపారు. వీటికి విద్యార్హతలు ఏమీ లేవని చెప్పారు. ఈనెల 15 లోగా మండల విద్యాశాఖ కార్యాలయంలో దరఖాస్తు అందించాలని కోరారు.

11న విశాఖకు మందకృష్ణ మాదిగ రాక!

మాడుగుల గ్రామీణం: ఈనెల 11న విశాఖపట్నం జరిగే మందకృష్ణ మాదిగ పర్యటన విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎలుసూరి గాటీలు మాదిగ కోరారు. మండల అధ్యక్షుడు జల్లి అప్పారావు ఆధ్వర్యంలో మాడుగుల అంబేడ్కర్ కాలనీలో బుధవారం సంఘ సమావేశం నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: పెద్దిపాలెం సమీపంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు గాయపడ్డారు. రావికమతం మండలం కొత్తకోటకు చెందిన శ్రీను, మరొకరితో కలసి ద్విచక్ర వాహనంపై మాకవరపాలెం మండలం బూరుగుపాలెం మీదుగా వెళ్తున్నారు. ఈ సమయంలో పెద్దిపాలెం సమీపంలో ఆటో అడ్డంగా రావడంతో ఢీకొన్నారు. దీంతో శ్రీను తలకు రోడ్డు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిద్దరినీ 108 వాహనంలో నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

గ్రామాలకు రూ. తొమ్మిది కోట్ల మంజూరు

దేవరాపల్లి: మండలంలోని 9 గ్రామాల్లో అభివృద్ధి పనులకు రూ. తొమ్మిది కోట్ల నిధులను ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మంజూరు చేయించారని తెదేపా మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ పేర్కొన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా బుధవారం చోడవరంలో నిధుల మంజూరు పత్రాలను తెదేపా నాయకులు అందుకున్నారు. కాశీపురం, మారేపల్లి, ఎన్.జి.నగరం, నాగయ్యపేట, వాలాబు, గరిసింగి, చిననందిపల్లి, దేవరాపల్లి, వాలాబులో మౌలిక సదుపాయాలకు ఉపాధి హామీ నిధులు ఖర్చు చేస్తామన్నారు.

అందరికీ అందుబాటులో చోడవరంలోనే ఉంటా

చోడవరం, న్యూస్‌టుడే: మాడుగుల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్న భావనతో తాను ముందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల తెదేపా, కూటమి కార్యకర్తలకు అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో చోడవరంలో క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఇక నుంచి కార్యకర్తలు తన స్వగ్రామమైన వెన్నెలపాలెం రావాల్సిన పనిలేదని, అందరికీ ఇక్కడే అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. బుధవారం చోడవరం పట్టణంలోని కోనాం అతిథిగృహం సమీపంలో లక్ష్మీపురం రహదారిని అనుకుని ఉన్న భవనంలో బండారు క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేశారు. తన సతీమణి మాధవీలత, కుమారుడు అప్పలనాయుడుతో కలిసి శాస్త్రోక్తంగా పూజలు జరిపి కొత్తగా తీసుకున్న ఇంట్లోకి ప్రవేశించారు. చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు క్యాంపు కార్యాలయానికి వచ్చి బండారుకు జ్ఞాపిక ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా నియమితులైన బత్తుల తాతయ్యబాబు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, పార్టీ నాయకులు పీవీజీ కుమార్, పైలా ప్రసాదరావు, జనసేన నాయకుడు రాయపురెడ్డి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో మాడుగుల ఎమ్మెల్యే బండారును జ్ఞాపికతో అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజు

రహదారుల పునరుద్ధరణకు నిధులు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నర్సీపట్నం నియోజకవర్గంలో రహదారుల మరమ్మతులకు రోడ్లు భవనాల శాఖ అధికారులు సన్నద్ధమవుతున్నారు. పనులకు సంబంధించిన ప్రతిపాదనలకు నాలుగైదు రోజుల్లో ఉన్నతాధికారుల నుంచి ఆమోదం రానుంది. పురపాలకలోని ఎక్సైజ్ స్టేషన్ నుంచి డిగ్రీ కళాశాల సమీపంలోని మార్కెట్ వరకు గోతులు పూడ్చేందుకు రూ. 6 లక్షలు, నాతవరం మండలంలోని గన్నవరం మెట్టప్రాంతంలో రోడ్డు పునరుద్ధరణకు రూ.15 లక్షలు, శరభవరం వద్ద గోతులు పూడ్చేందుకు రూ. 6 లక్షలు, మాకవరపాలెం మండలం కొండల అగ్రహారం నుంచి రోలుగుంట వరకు రోడ్డు మరమ్మతుకు రూ. 6 లక్షలు, కొండల అగ్రహారం నుంచి ఎండపల్లి రోడ్డు మరమ్మతుకు రూ. 10 లక్షలు, గిడుతూరు నుంచి జంగాలపల్లి మీదుగా కోటవురట్ల మండలం కైలాసపట్నం రోడ్డుకు రూ. 6 లక్షలు, గొలుగొండ మండలం కశిమి రోడ్డు మరమ్మతుకు రూ. 5 లక్షలు, నర్సీపట్నం మండలం వేములపూడి, ఎరకన్నపాలెం రోడ్డు మరమ్మతుకు రూ. 6 లక్షలు ఖర్చు చేయనున్నారు.



నర్సీపట్నం-చింతపల్లి రోడ్డులో గోతులు

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

కె.కోటపాడు, న్యూస్‌టుడే

?: ఎ.కోడూరులో హోమియోపతి వైద్యశాలను ఏర్పాటు చేసేందుకు చాలా కాలం కిందట నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉంది.
– **దేముడు, పొడుగుపాలెం**

✓: అధికారుల దృష్టికి తీసుకువెళ్లి భవనాన్ని వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తాం.
– **బొడ్డు అక్కునాయుడు, ఎ.కోడూరు సర్పంచి**

చదువుల తల్లికి వందనం

చోడవరం, బుచ్చెయ్యపేట, రోలుగుంట, న్యూస్‌టుడే: విజయదశమి సమీపిస్తుండటంతో దుర్గాదేవీ పీఠాల వద్ద ఉత్సవాల సందడి పెరిగింది. దేవీ మండపాల వద్ద భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. వెంకన్నపాలెం కూడలిలో భవానీ మాలధారులు అగ్నిగుండాల్లో నడిచి తమ మొక్కు తీర్చుకున్నారు. దాముసాపల్లిలో కనకదుర్గమ్మకు 51 రకాల పిండివంటలతో సారె ఊరేగించారు. వడ్డాది దొండా వీధి మండపం వద్ద, రాజాం గ్రామంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు తదితరులు దుర్గాదేవిని దర్శించుకుని పూజలు చేశారు. ఆర్.భీమవరం గ్రామంలో సరస్వతీ పూజ నిర్వహించారు. విద్యార్థులకు పుస్తకాలు, చినమల్లాం గ్రామంలో విశ్వజ్ఞానుల విజ్ఞాన విహార క్షేత్రంలో సరస్వతీ హోమం జరిగింది. చినపాచిలలోని వైష్ణవిదేవి ఆలయంలో చిన్నపిల్లలతో అక్షరాభ్యాసం చేయించారు.

చీడికాడ, కె.కోటపాడు, దేవరాపల్లి, న్యూస్‌టుడే: చీడికాడ మండలం అప్పలరాజుపురం మెట్టపై లలితాదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. గుల్లిపల్లి ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. న్యూస్‌టుడే: ఇక్కడి బస్టాండు ప్రాంతంలోని శ్రీ దుర్గా మల్లేశ్వరిస్వామి ఆలయంలో బుధవారం కనకదుర్గను సరస్వతీ దేవిగా అలంకరించారు. చేతుల్లో వీణతో కూడిన చదువుల తల్లిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా విద్యార్థులతో అష్టోత్తర పూజలు నిర్వహించి వారందరికీ పుస్తకాలు, పెన్నులు అందజేశారు. దేవరాపల్లి ఆటో స్టాండుతోపాటు వినాయకుడి గుడి వద్ద జరిగిన పూజల్లో పిల్లలతో వారి తల్లిదండ్రులు దగ్గరుండి పూజలు చేయించారు. బంటు గణేశ్ కుటుంబీకుల ఆధ్వర్యంలో చౌడువాడ బంటు వారి కల్లాల్లో దుర్గాదేవి అంబలం పూజ జరిగింది.

నర్సీపట్నం/అర్బన్, గొలుగొండ, కృష్ణదేవిపేట: పెదబొడ్డేపల్లి జ్ఞానసరస్వతిదేవి ఆలయంలో పుస్తక పూజలు, అక్షరాభ్యాసాలు సందడిగా సాగాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను తీసుకువచ్చి ఆలయంలో పుస్తకాలకు పూజలు చేయించారు. పిల్లలకు అక్షరాభ్యాసాలు చేయించారు. బలిఘట్టం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో సాయంత్రం సరస్వతీ హోమం నిర్వహించారు. గొలుగొండ గ్రామంలో భక్తులు బుధవారం దుర్గమ్మ తల్లికి భారీగా సారె సమర్పించారు. గొలుగొండ మండలం ఎ.ఎల్.పురం సంతోషిమాత ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు జరిగాయి. నాగాపురంలో భవానీ భక్తులు రాత్రి దీపారాధన కార్యక్రమం చేపట్టారు.



పెదబొడ్డేపల్లిలో జ్ఞాన సరస్వతి



సీతయ్యపేటలో..



దాముసాపల్లిలో అమ్మవారికి సారె తీసుకెళ్తున్న భక్తులు



గొలుగొండలో దుర్గమ్మ భక్తుల సారె ఊరేగింపు



నాగాపురంలో దీపారాధన



చౌడువాడలో దుర్గాదేవి అంబలం పూజ

జీడిమామిడికి దక్కని మద్దతు ధర

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: జీడిపిక్కలను రైతు సేవా కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న డిమాండ్ చేశారు. జీడి మామిడి తోటలకు ఈ-పంట నమోదు చేయాలని, మద్దతు ధర ప్రకటించాలని కోరుతూ తాటిపర్తి గ్రామంలో బుధవారం గిరిజనులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనకాపల్లి జిల్లాలో వేలాది ఎకరాల్లో జీడి మామిడి సాగవుతోందని, చాలా కుటుంబాలు తోటలపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు. జీడిపిక్కల అమ్మకాల్లో రైతులు దళారుల చేతుల్లో మోసపోతున్నారని తెలిపారు. 2018-19లో 80 కేజీల బస్తాకు సుమారుగా రూ. 12 వేలు రైతులకు వచ్చేదని, తర్వాతి కాలంలో రూ. 8 వేలకు పడిపోయిందన్నారు. ప్రభుత్వం 80 కేజీల బస్తాకు పిక్కలకు సుమారుగా రూ. 16 వేల మద్దతు ధర ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు కె.భవాని పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న వెంకన్న, గిరిజనులు

అధిక రసాయన ఎరువులతో నష్టం

గొలుగొండ, మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: పంటల్లో చీడపీడల నివారణకు ఇష్టానుసారం రసాయన పురుగు మందులు వాడితే లాభంకన్నా నష్టాలే ఎక్కువని గొలుగొండ వ్యవసాయాధికారి సుధారాణి తెలిపారు. బుధవారం ఏటిగైరంపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని వరి పైరును పరిశీలించి అన్నదాతలకు సూచనలు ఇచ్చారు. అధిక దిగుబడుల సాధనకు సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలని వివరించారు. మాడుగుల వ్యవసాయశాఖ అధికారి వాసుదేవరావు తాటిపర్తి, శంకరం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పంటను తెగుళ్లు ఆశించినప్పుడు రైతులు వెంటనే దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కె.కోటపాడు, న్యూస్‌టుడే: ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా అందించే రాయితీలను రైతులు వినియోగించుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకరరావు సూచించారు. మర్రివలస, సూదివలస గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. పీఎం కిసాన్ పథకం గురించి చోడవరం వ్యవసాయ సహాయ సంచాలకులు రవీంద్రనాథ్ వివరించారు. వ్యవసాయాధికారి సోమశేఖర్, కిరణ్మయి, కొటాన సూరిదేముడు తదితరులు పాల్గొన్నారు.



తాటిపర్తిలో పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

సస్యరక్షణ చర్యలు పాటించాలి

బుచ్చెయ్యపేట, రోలుగుంట న్యూస్‌టుడే: బుచ్చెయ్యపేట మండలం చింతపాకలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి బి.భాస్కరరావు రైతు సేవా కేంద్రం సిబ్బందితో కలిసి పంటల క్షేత్రపరిశీలన చేశారు. సస్యరక్షణ చర్యలపై రైతులకు వివరించారు. వరిలో ఆకుముడత తెగులు ఆశించినట్లు గుర్తించారు. నివారణ కోసం కార్ట్ ఆఫ్ హైడ్రోక్లోరైడ్ నీటిలో కరిగే పొడిమందు ఎకరానికి 400 గ్రాములు 200 లీటర్ల కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. రోలుగుంట మండలం కొవ్వూరులో వ్యవసాయ అధికారిణి విజయలక్ష్మి, కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ సత్తిబాబు వరి పొలాలను సందర్శించి రైతులకు పలు సూచనలు చేశారు. చింతపాక, కొవ్వూరు సర్పంచులు గొలజాన శ్రీను, ఎర్రంశెట్టి కాంతం, గ్రామ వ్యవసాయ సహాయకుడు సన్యాసినాయుడు పాల్గొన్నారు.

కాపులుప్పాడకు చెత్త తరలింపు

నర్సీపట్నం: ఇక్కడి డంపింగ్ యార్డులోని ఏళ్ల తరబడి నిల్వ ఉండి పలు సమస్యలకు కారణమవుతున్న చెత్తకు ఎట్టకేలకు విముక్తి లభిస్తోంది. దీనిని కాపులుప్పాడలోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంటుకు తరలించేందుకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఈ వ్యర్థాలను టిప్పర్‌లో పంపించే కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. కొండలా పేరుకుపోతున్న యార్డులోని చెత్తతో వాహనాలు తిరగలేని పరిస్థితి తదితర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక్కడ ఎందుకు పనికి రాకుండా ఉన్న వ్యర్థాలను రూ. 9.24 లక్షలతో జిందాల్ ఫ్యాక్టరీకి తరలించేందుకు ప్రతిపాదించారు. ఇప్పుడు ఏడున్నర టన్నులను తొలిసారిగా కాపులుప్పాడ పంపించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపుతున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

పరవాడ, న్యూస్‌టుడే: దుర్గాదేవి ఉత్సవాల్లో భాగంగా పరవాడ బొంకులదిబ్బలో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలను ఎంపీపీ పైలా వెంకట పద్మలక్ష్మి ప్రారంభించారు. మహిళలు ఉత్సాహంగా ముగ్గులను రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. 40 మంది మహిళలు పాల్గొన్నారు. పోటీల్లో జి.భాగ్యవతి(ప్రథమ), కె.తులసి(ద్వితీయ), పి.లక్ష్మి(తృతీయ), కె.ప్రతిభ(4వ స్థానం) పి.రాము(5వ స్థానం) విజేతలుగా నిలిచారు. వీరికి ఈనెల 12న బహుమతులను అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

పెందుర్తి

నేడు నేస్తాలమ్మ పండగ

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం నాయుడుపాలెం, వాడచీపురుపల్లి పంచాయతీ ప్రజల ఆరాధ్య దేవత నేస్తాలమ్మ అమ్మవారి పండగను గురువారం వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి దర్శనాలు ప్రారంభమవుతాయని కమిటీ ప్రతినిధులు తెలిపారు. సాయంత్రం అమ్మవారి అనుపోత్సవం, రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు వెల్లడించారు.

మేమున్నాం.. మీకు తోడుగా 10 AM - 1 PM

పెందుర్తి: 90598 98721 వేపగుంట: 93472 79909

న్యూస్‌టుడే, సబ్బవరం

సమస్య: సబ్బవరం మండల కేంద్రం సాయినగర్ కాలనీలోని 80 అడుగుల రోడ్డులో వ్యర్థాలు పేరుకుపోయాయి. దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలు ముసురుతున్నాయి. అధికారులు స్పందించి తొలగించేలా చూడాలి.
- పి.కోటేశ్వరరావు, సాయినగర్ కాలనీ

సమాధానం: సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగించేలా ఏర్పాటు చేస్తా. - దేవ్ర ప్రసాదరావు, సర్పంచి సబ్బవరం

మట్టి వ్యాపారం.. మూడు లోడులు.. ఆరు కాసులు

పట్టించుకోని రెవెన్యూ, గనులశాఖ అధికారులు

వేపగుంట, న్యూస్‌టుడే

కొండలు, ప్రభుత్వ భూములు కనిపిస్తే చాలు కొంతమందికి అక్రమ తవ్వకాలు గుర్తొస్తాయి. కొంత ప్రాంతం వరకే మట్టి తవ్వకాలకు అనుమతులు తీసుకుని ఆ తర్వాత ఇష్టారాజ్యంగా నిబంధనలను బేఖాతరు చేస్తూ భారీగా తవ్వకాలు జరిపి పర్యావరణానికి తూట్లు పొడుస్తున్నారు. నియంత్రించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంతో మట్టి వ్యాపారం మూడు లోడులు.. ఆరు కాసులుగా ఉంటోంది. నగర శివారు వేపగుంట, పొర్లుపాలెం, నరవ ప్రాంతాల్లో విచ్చలవిడిగా అక్రమతవ్వకాలు జరుగుతున్నాయి. గ్రామస్థులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోవడంతో అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారు. పొర్లుపాలెం మాజీ ఉప సర్పంచి గళ్ల రమణ తెలిపిన వివరాల మేరకు.. గ్రామంలోని సర్వే నెంబరు 75లో ఓ వ్యక్తి తవ్వకాలకు రెవెన్యూ, గనుల శాఖ అధికారులు 3.31 హెక్టార్లలో అనుమతులు ఇచ్చారు. అతను అనుమతులు తీసుకున్న దానికంటే ఎక్కువ ప్రాంతంలో తవ్వకాలు జరపడం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతోందంటూ గత వైకాపా ప్రభుత్వ హయాంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఫలితం లేకపోయిందని గళ్ల రమణ ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ ఫిర్యాదు చేశానని చెబుతున్నారు.


పొర్లుపాలెం కొండపై తవ్వకాలు జరిపిన ప్రాంతం

సర్వే చేసి అపరాధ రుసుం విధించినా..

గనులశాఖ అధికారులు స్పందించి ఇటీవల తవ్వకాలపై సర్వే చేశారు. అనుమతులు ఇచ్చిన దాని కంటే ఎక్కువగానే మట్టి తరలించినట్లు నిర్ధారణకు వచ్చారు. తవ్వకందారుడికి రూ.కోటి 55 లక్షలు సీనరేజ్ ఫీజులు చెల్లించాలని ఆదేశించారు. ఆ జరిమానా చెల్లించింది లేనిదే అధికారులకే తెలియాలి. సర్వే కూడా సక్రమంగా చేపట్టలేదని కేవలం అనుమతులు ఇచ్చిన ప్రదేశంలోనే కొలతలు తీశారు తప్ప బయట తవ్వకాలు జరిపిన ప్రాంతంలో ఎందుకు సర్వే చేయలేదని అధికారులను రమణ ప్రశ్నించారు. తాము అనుమతులు ఇచ్చిన ప్రదేశంలో ఎంతమేర అక్రమంగా తవ్వకాలు జరిపారో చూస్తామని, మిగిలిన ప్రదేశం కొలతలు చేయాలని ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ లేఖలు రాసుకుంటున్నారని రమణ పేర్కొన్నారు. వాస్తవంగా అనుమతులు ఇచ్చిన దానికంటే సుమారు 30 హెక్టార్లలో ఐదు లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని అక్రమంగా తరలించారని ఆరోపించారు. దీంతో ప్రభుత్వానికి రూ.కోట్లలో నష్టం చేకూరుతోందని ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మంగళగిరిలో ఎమ్మెల్యే వినతుల స్వీకరణ

పెందుర్తి, వేపగుంట, న్యూస్‌టుడే: జనసేన పార్టీ నిర్వహిస్తున్న జనవాణి కార్యక్రమంలో భాగంగా బుధవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పాల్గొన్నారు. పలువురు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆయా సమస్యలను నమోదు చేసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. నెలలో ఒకసారి పంచకర్ల ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు.


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

శ్రీవారి సేవలో సరస్వతి నృత్య కళా పీఠం బృందం

వేపగుంట, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాయుడుతోట సరస్వతి నృత్య కళాపీఠం విద్యార్థినులు పాల్గొని కూచిపూడి నృత్యం చేశారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి పిలుపురావడంతో శిక్షకురాలు కె.బాలసరస్వతి సారథ్యంలో బృంద సభ్యులు 20 మంది అక్కడకు వెళ్లి బుధవారం శ్రీవారి రథం వెనుక మాడ వీధుల్లో నృత్యం చేసి భక్తులను అలరించారు. నిర్వాహకులు వీరిని సత్కరించారు.


తిరుమల మాడ వీధుల్లో నృత్యం చేస్తున్న సరస్వతి నృత్య కళా పీఠం విద్యార్థినులు

బీఆర్టీఎస్‌లో ప్రమాదాల నివారణకు చర్యలు

వేపగుంట, న్యూస్‌టుడే: బీఆర్టీఎస్ సర్వీసు రహదారిలో వాహనాల వేగాన్ని నియంత్రించి, ప్రమాదాలను అరికట్టేందుకు జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా పలుచోట్ల వేగ నిరోధకాలను నిర్మిస్తున్నారు. ఎక్కువ ప్రమాదాలు జరిగే ప్రాంతాలైన జీవీఎంసీ జోన్-8 కార్యాలయం దరి, వేపగుంట కూడలి, పినగాడి వెళ్లే ఫ్రీలెఫ్ట్, పురుషోత్తపురం బాలాజీ హైఫీల్డ్స్ పాఠశాల, వేపగుంట జెడ్పీ పాఠశాలల వద్ద వేగ నిరోధకాలను నిర్మిస్తున్నారు. ట్రాఫిక్ ఎస్‌ఐ నర్సింగరాజు దగ్గరుండి ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. వాహనదారులు వేగ నిరోధకాలను గమనించుకుంటూ ప్రయాణాలు సాగించాలని ఎస్‌ఐ సూచించారు.


వేపగుంట కూడలిలోని ఫ్రీలెఫ్ట్‌లో నిర్మించిన వేగ నిరోధకం

వరి పొలాల్లో ఆకుముడత తెగులు గుర్తింపు

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి మండలంలోని ఎస్‌ఆర్‌పురం, ముదపాక, సరిపల్లి, గుర్రమ్మపాలెం తదితర గ్రామాల్లోని వరిపంటలో శాస్త్రవేత్తలు ఆకుముడత, పాముపొడ తెగులు గుర్తించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు బుధవారం ఆయా గ్రామాల్లో క్షేత్ర సందర్శన చేశారు. వరి పంటలో తెగుళ్ల నివారణ రైతులు పిచికారీ చేయాల్సిన మందులను వివరించారు. వంగ, టమాటా, బీర, మామిడి పంటల్లో చేపట్టాల్సిన ఎరువుల యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు టి.శ్రీలత, ఆర్.సరిత, హరిత్రిష్ణ, పెందుర్తి వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


సరిపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు


జెడ్పీ సీఈవో నారాయణమూర్తిని సన్మానిస్తున్న ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు, ఉద్యోగులు

సంక్షేమ పథకాల అమలుపై ఆరా..!

పెందుర్తి, న్యూస్‌టుడే: జడ్పీ సీఈవోగా బాధ్యతలు స్వీకరించిన నారాయణమూర్తి బుధవారం పెందుర్తి మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. మండలంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఇన్‌ఛార్జి ఎంపీడీవో కొల్లి వెంకటరావు ఆధ్వర్యంలో ఉద్యోగులు ఆయనను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ గుండు అప్పలరాజు, గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పన

వేపగుంట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవీఎంసీ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పన పనులు ఊపందుకున్నాయి. జీవీఎంసీ 93వ వార్డు గొల్లనారాయణపురంలోని సామాజిక భవనం నుంచి పోలిపిల్లమ్మ అమ్మవారి ఆలయం వరకు రూ.30 లక్షలతో సిమెంటు రహదారి నిర్మిస్తున్నారు. ఆయా పనులను కార్పొరేటరు రాపర్తి కన్నా, వార్డు తెదేపా కమిటీ సభ్యులు బుధవారం పరిశీలించారు. పనుల్లో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా నాణ్యతతో చేయాలని గుత్తేదారుకు సూచించారు. రహదారి నిర్మాణంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెల్ల అప్పలరాజు, దుక్క అప్పారావు, పల్లరవి, జి.మహేశ్, కర్రి పైడిరాజు, కిలారి చిన్నారావు, అజయ్, కర్రి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


రహదారి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రాపర్తి కన్నా, తదితరులు

రాయితీ టమాటాలకు బారులు


టమాటా దుకాణం ఎదుట వినియోగదారులు

పెందుర్తి, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా టమాటా ధరలు కొండెక్కిన నేపథ్యంలో ప్రభుత్వం రైతుబజార్‌లలో రాయితీ ధరలకు విక్రయాలు చేయాలని ఆదేశించింది. ఆ మేరకు పెందుర్తి రైతుబజార్‌లో బుధవారం నుంచి రాయితీ టమాటా విక్రయాలు ప్రారంభమయ్యాయి. కిలో రూ.50కు ఒక్కో వినియోగదారుడికి 2 కిలోల చొప్పున విక్రయిస్తున్నట్లు ఎస్టేట్ అధికారి షర్మిల తెలిపారు. టమాటా విక్రయాలను జిల్లా మార్కెటింగ్ శాఖ సంయుక్త సంచాలకులు సుధాకర్, ఉప సంచాలకులు శ్రీనివాస్ కిరణ్ పరిశీలించారు. ఎలాంటి లోపాలు, ఇబ్బందులు లేకుండా విక్రయాలు జరపాలని అధికారులను ఆదేశించారు. బుధవారం పెందుర్తి రైతుబజార్ శెలవు అయినప్పటికీ కేవలం టమాటా విక్రయాల కోసం మాత్రమే తెరిచారు.

మర్యాద పూర్వక కలయిక

పెందుర్తి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన బత్తుల తాతయ్యబాబును జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. చోడవరంలోని వడ్దాది గ్రామంలో ఆయన నివాసంలో కలిసి శాలువతో సత్కరించారు.


బత్తుల తాతయ్యబాబును సత్కరిస్తున్న జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, తదితరులు

అనాథ బాలికలకు నిత్యావసరాల వితరణ

సుజాతనగర్(పెందుర్తి), న్యూస్‌టుడే: హైదరాబాద్‌కు చెందిన పి.సతీశ్‌కుమార్ కుటుంబం సుజాతనగర్ దరి ఆకార్ బాలికల సంరక్షణ కేంద్రంలో ఉంటున్న అనాథ బాలికలకు బుధవారం నిత్యావసర వస్తువులు వితరణ చేశారు. మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. వారి రోజువారీ అవసరాలకు సరిపడే విధంగా సామగ్రిని పంపిణీ చేశామని దాతలు పేర్కొన్నారు.


బాలికలకు నిత్యావసరాలు అందించిన సతీశ్‌కుమార్, కుటుంబ సభ్యులు

పొగ.. పర్యావరణానికి సెగ

పరవాడ, న్యూస్‌టుడే: సకాలంలో చెత్తను సంపద కేంద్రాలు, డంపింగ్ యార్డులకు తరలించకపోవడతో పలువురు వాటికి నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ అలముకుని స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పరవాడ మండలం గొర్లెవానిపాలెం పంచాయతీలో ఎక్కడ చూసినా వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. కొత్తగొర్లెవానిపాలెం, జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ సమీపంలో గాజువాక - ఎలమంచిలి రహదారిని ఆనుకుని చెత్తకుప్పలు పేరుకుపోయాయి. స్థానిక దుకాణాల నుంచి వెలువడే ప్లాస్టిక్ వ్యర్థాలను ఇక్కడ వేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ ముఖద్వారానికి ఎదురుగా ఉన్న వ్యర్థాలకు బుధవారం సాయంత్రం నిప్పు పెట్టడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు, పాదచారులు దట్టమైన పొగ, కళ్ల మంటలతో నానా ఇబ్బందులు పడ్డారు. రహదారి పక్కన చెత్త వేస్తే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని పంచాయతీ అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టినా ఫలితం లేకుండా పోయిందని పలువురు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చెత్త సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


గొర్లెవానిపాలెం టిడ్కో నివాసాలకు సమీపంలో పేరుకుపోయిన చెత్త


జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ ముఖద్వారం వద్ద చెత్తకు నిప్పు పెట్టడంతో అలముకున్న పొగ


సరిపల్లిలో చదువుల తల్లిగా దుర్గమాంబ


ఎస్‌ఆర్‌పురంలో..


శ్రమశక్తినగర్‌లో..


సప్తగిరినగర్‌లో విద్యా లక్ష్మిగా అలమేలు మంగమ్మ


తానాంలో..


సరస్వతీదేవిగా నాయుడు తోట గాయత్రి అమ్మవారు

వందే జననీ.. విద్యాదాయిని

వందే జననీ విద్యాదాయిని.. వాణీ వీణా మృదుపాణి.. అంటూ భక్తులు చదువుల తల్లి సరస్వతీ మాతను భక్తిశ్రద్ధలతో కొలిచారు. శ్రీదేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని జగన్మాత సరస్వతిగా భక్తుల పూజలందుకుంది. పలు దేవాలయాలు, ఉత్సవ మండపాల కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల సామూహిక అక్షరాభ్యాసాలు జరిపారు. తల్లిదండ్రులు తమ చిన్నారులతో కలిసి పాల్గొన్నారు. నిర్వాహకులు బాలలకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

– న్యూస్‌టుడే, పెందుర్తి, వేపగుంట, పరవాడ, సబ్బవరం


దుర్గానగర్‌లో..


వేపగుంట ముత్యమాంబ


కృష్ణానగర్‌లో..


బాలాజీగార్డెన్ అపార్ట్‌మెంట్‌లో..


సబ్బవరం దుర్గమాంబ


దేవీపురంలో హంస వాహనంపై..


పిట్టవానిపాలెంలో..


పరవాడ కొత్తకాలనీలో


వెన్నెలపాలెం హనుమాన్‌కాలనీలో..


మొగలిపురంలో అమ్మవారిని దర్శించుకుంటున్న నేతలు


శారదాపీఠంలో సామూహిక అక్షరాభ్యాసం


పరవాడ సంతబయలులో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న నాయకులు, కమిటీ ప్రతినిధులు

దెబ్బతిన్న ఉద్యానపంటల పరిశీలన

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి పాలవలసలో మామిడి, జీడిమామిడి తదితర ఉద్యాన పంటలను బుధవారం ఉద్యానవన శాఖ ఏడీ కె.ఎస్.ఎన్.రెడ్డి పరిశీలించారు. పాలవలసలోని హిందుజా విద్యుత్తు కేంద్రానికి చెందిన యాష్‌పాండ్ నీటి కాలుష్యం వల్ల జీడిమామిడి, కొబ్బరితోటలు దెబ్బతింటున్నాయని ఈనెల 7న విశాఖ జిల్లా కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో స్థానిక రైతులు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఏడీ రైతులతో కలిసి తోటలను పరిశీలించారు. చనిపోయిన చెట్లకు పరిహారం ఇప్పించి ఆదుకోవాలని ఏడీని రైతులంతా కోరారు. యాష్‌పాండ్ నీరు తోటల్లోకి రాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని కోరారు. ఇక్కడి నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని ఏడీ రైతులకు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పాల అచ్చిలనాయుడు, పాల నగేశ్, కాకి నారాయణ తదితరులు పాల్గొన్నారు.


ఏడీకి సమస్యలను వివరిస్తున్న నాయకులు, రైతులు

'సెయిల్‌లో విలీనం చేయాల్సిందే..!'

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే : ఉక్కు కర్మాగారాన్ని సెయిల్‌లో విలీనం చేసి, కార్మిక భద్రత కల్పించాలని పోరాట కమిటీ నాయకుడు ఎం.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగుతున్న రిలే దీక్షలు బుధవారం 1136వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమను కాపాడాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకోవాలన్నారు. ఇదే అంశంపై కేంద్రాన్ని ఒప్పించాలని కోరారు. శిబిరంలో ఇంటక్ నాయకులు, సభ్యులు కూర్చున్నారు. పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, వి.రామ్మోహన్‌కుమార్, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


శిబిరంలో మాట్లాడుతున్న రాజశేఖర్